# 1984లో ఓ రోజు

ఆంధ్రజ్యోతి 17-5-74

1984 లో ఒక రోజును ఊహిస్తూ 1974 లో ఓ కథ వ్రాసాను. 1994 కూడా దాటాక ఈ కథ సంకలనంలో చోటు చేసుకుంది. 2004 ఎలా వుంటుందో ?

—జయప్రద

---

"ఇదిగో ఇన్ని మాటలులేదు. మూడు రూపాయలిస్తా ఆరు వంకాయలు ఇస్తే ఇవ్వు లేకపోతే చక్కాలేచి వెళ్ళిపో."

అరగంటక్రితం కూరలమ్మి తలుపుతట్టిన చప్పుడుకు మేల్కొన్న నేను ఈ అరగంటలో మా శ్రీమతి నోటివెంట ఆ మాట అరడజను సార్లన్నా వినుంటాను.

ఆ కూరలమ్మి ధర తగ్గించదు, లేచి వెళ్ళదు. మా ఆవిడ తన పంతం వదలదు.

ఆ సమస్యా పరిష్కారానికి ఇంతవరకు ఎదురు చూసిన నేను, ఇక ఎదురుచూసే ఓపిక లేక తల మీదుగా ముసుగు తన్నేసి రెండో నిద్ర కుపక్రమించాను.

"అదేంటే చంటిబిడ్డకు పాలు మీరీ అంత పల్చగా ఇస్తున్నావ్. అసలివి పాలా? నీళ్ళా? ఎన్ని నీళ్ళు కలిపావేమిటి?"

"లేదత్తయ్యా. రామస్వామి పోసిందే అంత. నేను నీళ్ళు కలపనే లేదు"

అత్తగారి గదమాయింపూ, కోడలి సంజాయిషీ లీలాగా విన్పిస్తూనే వున్నాయి.

"అవును వదినా! చీప్‌గా లీటరు పదిరూపాయలకే పోస్తున్నాడని అందరూ రామస్వామి పాలమీద కెగబడితిరి- మరివాడు మాత్రం పాలు ఉత్పత్తి చేయలేడు కదా! ఈ రోజు మరో క్రొత్త బేరం తగిలుంటుంది. ఎవరినీ నిరాశపర్చడం ఇష్టంలేని వాడు మునిసిపాలిటీ కుళాయిని ఆశ్ర యించుంటాడు."

మా ఆఖరి సుపుత్రుడు రంగంలోకొచ్చి పట్టుకున్నాడు. వాడికి రోజూ నీళ్ళ పాలందుతున్నాయని వాడి అక్కసు వాడిది.

ఆ తర్వాత స్పష్టంగా వివాదాలు, వాగ్యుద్ధాలు లాటివి కాక పోయినా, శ్రీమతి గొణుగుడు, కోడలి గాజుల చప్పుడు మాత్రం కాసేపు విన్పించి ఆ తర్వాత అంత నిశ్శబ్దమైపోయింది.

లెచి బ్రష్ చేసుకుని కాఫీ కొరకు వంటింట్లోకి అడుగుబెట్టిన నాకు మహాద్భుతమూ, అతి కమనీయమూ అయిన దృశ్యం కంటబడింది. ఒకే ఒక్క బీరకాయను రెండు కూరలుగా చేయాలని వాళ్ళ తాప త్రయం.

"మరీ కండంతా తొక్కులో వదిలేశావే. కూరెలా సరిపోతుంది?" అంటోంది నా శ్రీమతి.

"మరి ఈ నలుగు తొక్కలు బండ మీద వేస్తే బండ కంటుకుపోతుందని. మరికాస్త అందులో వుంచేశానత్తయ్యా" అని తన పచ్చకాభిమానాన్ని వెలిబుచ్చుతోంది నా కోడలు.

"అయినా ఇదెలా కూర చేయనే" అని బేలగా తరిగిన ముక్కల వేపు చూస్తున్న అత్తగారికి మరలా తనే సలహా ఇచ్చింది.

"శనగపప్పు కలిపి వండేద్దాంలే అత్తయ్యా"

"సరే పో. లేచి ఓ పాతిక పప్పులు తీసుకురా"

ఇదొక వింత భాష, ఎప్పుడయినా కె.జి. అరకేజీలాటివి వినడమే గాని, శనగపప్పును- పాతిక పప్పులు అనడం– జీడిపప్పులాగ, ఇదే వినడం.

పెళ్ళయినప్పటి నుండి, ఉద్యోగార్థం కొడుకు, కోడలు విజయవాడలో వుండిపోవడంలో, కూతుళ్ళంతా పెళ్ళయి వెళ్ళిపోవడంతో, మా శ్రీమతికి నోటిమాట చెప్పుకోవడానికి మరో ఆడతోడు ఇంట్లో లేని మూలంగా, యిలాంటి సంభాషణలు వినే భాగ్యం నాకింతవరకు కలగలేదు.

ఆ పప్పుల లెక్కేమిటో తెలుసుకోవాలనే - కుతూహలం కలిగినా అలా అడిగి–

"మీకేం మగమహారాజులు. ముష్టి వెయ్యి రూపాయలు తెచ్చి నా ముఖాన కొట్టి కాలుమీద కాలేసుకుని దర్జాగా కూర్చుంటారు. ఆ నాలుగు రాళ్ళతో ఈ సంసారాన్ని ఎలా ఈదుతున్నానో ఆ భగవంతుడికే తెలియాలి.

ఇంకో ఐదువందలన్నా ఇవ్వండే ఈ ఇంటి ఖర్చులతో నేను యుద్ధం చేయలేను" అని జాడిస్తే, అదీ కొత్తలి ముందు. వినే సాహసం లేక నా కోరికను చంపుకున్నాను.

"నాకు కాస్త కాఫీ ఇస్తావా లక్ష్మి" వేడికోలుగా అడిగాను. రోజూ పొద్దున్నే శ్రీమతి శ్రీనరసింహావతారం ఎత్తేస్తుంది.

కళ్ళు తెరిచాక కూరగాయలమ్మి దగ్గర నుండి కూర తయ్యా రయి నన్ను ఆఫీసుకు పంపేదాకా ఆమెకు అన్నీ సమస్యలుగానే వుంటాయి.

ఆ విషయం బాగా తెలిసిన నేను పది గంటలవరకు కాస్త జాగ్ర త్తగా మాటలు వాడుతుంటాను.

"కాఫీపొడి నిన్నటితో అయిపోయిందండి. కాస్త పనిపిల్లకు, మీ జేబులో చిల్లరుంటే రెండు రూపాయలు ఇచ్చి ఓ కప్పు కాఫీ తెప్పించు కోండి"

"అది కాదే! నీ చేతులతో కాఫీ చేస్తే అమృతంలా వుంటుందనీ" కాస్త ఉబ్బించబోయాను.

"గయ్" మంది చేతులు త్రిప్పుతూ.

"ఈ నెలాఖరు రోజుల్లో ఎక్కడ నుండి తెస్తారో యాభయ్ రూపాయలు తెచ్చి, కాఫీ పొట్లాం పట్టండి. అమృతం కాచిస్తాను"

"యాభయ్ రూపాయలా? అయితే అమృతం వద్దులే కాఫీయే త్రాగుతాను"

ఈ రోజు ఏదో పండగ కాబోలు (పండగ చేసుకోవాల్సి వస్తుం దని భయపడి, పండగ రోజులు గుర్తుపెట్టుకోవడం మానేసి చాలా రోజు లయింది) సెలవిచ్చారు.

తీరిగ్గా నేను గుమాస్తాగా వున్న రోజులలో కొనుక్కున్న పాత సోఫాలో వెనక్కి వాలి, శాస్త్రీయ సంగీత మేమైనా వినిపిస్తుందేమోనని రేడియో ట్యూన్ చేశాను.

"గవర్నమెంటువారు రైతుల యెడల అతి శ్రద్ధ తీసుకుని వారికి అందుబాటులో వుండేలాగున, రసాయనపు ఎరువులను తమ అధీనం చేసుకున్నారు. కావున రైతులు అందరూ ఈ సదవకాశాన్ని ఉపయో

గించుకుని రెట్టింపు పంటను పొందండి. దేశాన్ని సస్యశ్యామలం చేయండి"

"వెధవ గోల" రేడియో కట్టేశాను.

"అదేంటి నాన్నా ఎరువులు దొరకడంలేదని కదూ మొన్న అన్నయ్యతో అంటున్నావు"

మా చిన్నాడి సందేహం.

"దొరుకుతాయిరా నాన్నా. నువ్వు పండించబోయే ధాన్యంకంటే రెట్టింపు ధర నువ్వు పెట్టగలిగితే- భూ గృహాల్లో నుండి బయటికొస్తాయిరా"

నేను చెప్పింది వాడికి బొత్తిగా అర్ధంకాలేదని వాడి వెర్రి ముఖమే చెపుతోంది.

"కృష్ణా!" వంటింట్లో నుండి మావాడికి టెలిఫోన్.

"వస్తున్నా వదినా! నాన్నా మిమ్మల్నడిగి ఐదురూపాయలు తీసుకుని వదిన వారపత్రిక తీసుకురమ్మంది"

నా జేబులో ఐదు రూపాయలతో వాడు మాయం కాగానే ఆరేళ్ళ నా మనవరాలు ప్రత్యక్షమయింది.

"తాతయ్యా! తాతయ్యా! నాకు కాస్త సిమెంటు తెచ్చిపెట్టవూ! మరేం పక్కింటి వారిజ దగ్గర సిమెంటు బుడ్లు ఎంత బాగున్నాయనుకున్నావ్! నేను కూడా తయారుచేసుకుంటా తాతయ్యా !"

"అరెం సిమ్మెంటా అదెలా వుంటుందే అమ్మలూ? నువ్వు పుట్టాక అలాటి పదార్థం చూసినట్టు నాకుగుర్తులేదే! బహుశా నాకు కన్పించకుండా అది ఎక్కడో చీకట్లో దాక్కొనుంటుందే బుజ్జీ"

"ప్లో తాతయ్యా- నువ్వెప్పుడూ ఇంతే"

"బీరకాయ పచ్చడి చేశాను. బీరకాయ పప్పుకూర వండాను. చారు పెట్టాను. మజ్జిగ వుంది. నంజుకోవడానికి ఏమి తెప్పించమంటారో చెప్పండి. ఇంట్లో ఏం లేదు"

'కోడిగుడ్డు' అందామనుకుని ఉదయపు వేడి గుర్తుకొచ్చి బుద్ధి మంతుడిలా—

"అప్పడాలయితే చీప్‌గా వస్తాయనుకుంటానేం ! తలొక అప్పడం తెప్పించెయ్. ఆరుగురికి ఆరు అప్పడాలు నూటిరవై పైసలకొచ్చేస్తాయ్ కదూ లక్ష్మి" అన్నాను.

"ఉష్! అని పెరటి ద్వారం వైపు చూపిస్తూ, నా వాగ్దానాన్ని నివారించింది శ్రీమని.

"మీరు భలేవారే! వాళ్ళు ధరలు పెంచకముందే మీరు పెంచేట్టు న్నారు. అది అప్పడం పదిహేను పైసలకే ఇస్తుంది. అదక్కడ నిల్చొండి. విన్నదంటే, రేప్పొద్దున వచ్చి "అప్పడం ఐదు పైసలు పెంచారమ్మా" అంటుంది. అప్పడం ధర కూడా ఇందిరాగాంధీయే పెంచినట్టూ, ఇది ఉట్టి అమాయకురాలైనట్టూ. అయినా "కాటన్ మార్కెట్"లాగా మన మార్కెట్టూ పూటకి ఒక ధర అయిపోయిందే విటండీ!"

నా అన్నం ప్లేట్లో అప్పడానికి బదులు కోడిగుడ్డు ప్రత్యక్ష మయింది. "మూడు రూపాయలు పెట్టి ఈ నెలాఖరులో కోడి గుడ్డెందుకు కొన్నావే లక్ష్మి అప్పడంతో తినేసేవాళ్ళంగా."

నా భార్య దగ్గర నుండి సానుభూతి సంపాయించడానికి దొరికిన ఈ సదవకాశాన్ని నేను వృధాపోనీ దల్చుకోలేదు.

"మీకూ, మీ సుపుత్రుడికీ అది లేందే ముద్ద దిగుతుందా? రేప్పొ ద్దున గుడ్డు నాలుగు రూపాయలయినా నాకు తప్పుతుందా? అయినా

అప్పడం అయితే మాత్రం గుటుక్ గుటుక్ మని మింగనూ? నూనె ధరెంతో మీకు తెలుసా అసలు?"

ఈ రోజు మా శ్రీమతి టెంపరేచర్ తగ్గేలా లేదు, ఆ వేడిలో అది మాడిపోతుందని భయపడి చిన్న జోక్ విసిరాను.

"అయితే ఈ రోజు మీ అత్తా కోడళ్ళకు రెండేసి అప్పడాలు దక్కాయన్న మాట."

"ఆఁఆ....అన్నీ మేము మింగేస్తే రాత్రికి ముద్ద దిగొద్దూ మీకూ!"

తన మాటల్లోని కటుత్వాన్నీ, వాటి వెనక-మా పట్ల వుండేమార్ధవాన్నీ తలుచుకుంటూ, భగ భగ మండుతున్నదాన్నే చూస్తున్నాను. నా బావమరిది కూతురయినా నా దగ్గర అంతగా చనువులేదు. కోడలు, తలుపు చాటునుండి, ఈ సినిమా అంతా గమనిస్తూనే వుంది.

నా అన్నం కంటే, బీరకాయ కూరకంటే ముందు నా కోడి గుడ్డు అయిపోయి కూర్చుంది. ఇక మిగిలిన అన్నం గొంతులోకి పోవడానికి సమ్మె చేసింది. మెల్లగా ప్లేటు దగ్గర నుండి లేవబోయాను. కోప్పడుతుందేమోనని అనుమానిస్తున్న నాకు చిత్రంగా ఆమె కళ్ళు తడి ఆవడం కన్పించింది.

పాపిష్టిదాన్ని మీకు సరిగా తిండి కూడా పెట్టలేకపోతున్నాను. ప్రొద్దస్తమానం ఆఫీసులో చాకిరీ చేయాలి."

ఆ ఆర్ద్రతలో నేను కరిగిపోయాను. మానసికంగా పసిపాపనై తన ఒడిలో ఒదిగిపోయాను.

ఈ పాపిష్టి జన్మకు చావయినా రాదు. ఈ ధరలేమో రోజు-రోజుకి మండిపోతూనే వుంటాయి. ఇక నాలుగు రోజులుపోతే ఈ మాత్రం అయినా మీకు చేసిపెట్టగలుగుతానో లేదో! మిమ్మల్ని ఉపవాసం వుంచే రోజు రాకముందే నన్ను కడతేర్చరా అని దేవుణ్ని కోరుకోని రోజులేదు" ఆమె కళ్ళు నిండుకున్నాయి. ఆమె కంఠం పూడిపోయింది.

పొద్దుటినుండి అది ఏమన్నా, నేను నవ్వుతాలుగా తీసుకున్నాను. దాని విసుగును పట్టించుకోలేదు. కానీ తన విసుగు వెనక దాని సమస్య, దాని వ్యధ అర్ధమయిన నేను పశ్చాత్తాపంతో కరిగిపోయాను.

"చూడు లక్ష్మి. నువ్వు బాధపడకు. నేనింకా సంపాదిస్తాను.ఏదో మార్గం చూస్తాను. నువ్వు కంట తడి పెడితే మాత్రం నేను చూడలేను. కన్ను తుడుచుకో."

బాగానే వుంది సంబడం! ఇంకా సంపాయిస్తాడట ఈ వయస్సులో" కొంగుతో ముక్కు తుడుచుకుంటూ లోపలి కెళ్ళబోయింది.

"అదేంటోయ్! వెళ్ళిపోతున్నావ్, నేను యింకా తింటాను.నువ్వు వద్దన్నవరకు తినేస్తాను. రా మరీ నువ్వు వచ్చి వడ్డిస్తే కదా!"

"కీ" ఇచ్చినట్టు గబగబ వెనక్కి వచ్చేసింది. నా ప్లేట్లో మరింత అన్నం వడ్డించి "చారు పోయనా!" అంది. చారు పోసుకుని, ముద్ద నోట్లో పెట్టుకున్న నాకు "అంతా తినేస్తా"నని ముందుగా ప్రతిజ్ఞ చేయడం పొరపాటయిందనిపించింది. చారులో బొత్తిగా కాకపోయినా, అసలు ఉప్పులేనట్టే లెక్క. నా శ్రీమతి నా అవస్థ అప్పుడే గమనించి నట్లుంది నాతో పాతికేళ్ళ సర్వీసు మరి.

"కాస్త ఉప్పు తక్కువయింది కదూ!" అంది మెత్తగా. అవునన్నట్లు తలూపాను.

"ఫర్వాలేదు. ఇప్పుడు కలిపేసుకుంటాగా కాస్త పట్రా."

లేదండీ. రేషన్ కార్డుమీద తీసుకున్న ఉప్పు ఈ రోజుటితో అయిపోయింది బ్లాక్‌లో ఒక శేరు తెమ్మని రెండు రూపాయ్యలిస్తే, దొరకలేదన్నొచ్చాడు."

ఫరవాలేదు. ఫరవాలేదు. తినేస్తున్నా!"

ఆ రోజు సినిమా చూడాలని కోరిక కలిగింది శ్రీమతికి. మేము సినిమా చూసి కూడా మూడు నెలలు కావస్తోంది. మా ఇంటికి సినిమా హాలుకి ఫర్లాంగు దూరం. రిక్షాకి రెండు రూపాయలిచ్చుకోడానికి నా జేబు ఒప్పుకోక నడక ప్రారంభించాం.

ఒక బట్టల దుకాణం "షోకేస్" దగ్గర ఆగిపోయింది లక్ష్మి. ఆ షోకేస్‌లో అందమైన బొమ్మ, ఆ బొమ్మకి కట్టిన అందమైన చీర, ఆ చీరనే చూస్తున్న అందమైన నా శ్రీమతి నేత్ర ద్వయం-వాటిని మార్చి చూస్తున్న నాతో.

అలాటి చీర మన పెళ్ళయిన కొత్తలో మీరు కొనిచ్చారు గుర్తు వుందా? మరలా అది ప్యాషనయింది కాబోలు" అనేసి నా జవాబుకెదురు చూడకుండా బొమ్మకు దగ్గరగా నడిచింది

మన పెళ్ళయిన కొత్తలోనే నయం. అడపా దడపా ఒక్కపట్టు చీరన్నా కొనిచ్చేవారు ఇప్పుడు కళ్ళచూద్దామన్నా పట్టుచీర లేదు అలా నన్ను ఉడికించబోతున్న శ్రీమతి స్వరం వున్నట్టుండి పలచబడి పోయింది. కళ్ళు కుచించుకుపోయాయి.

"ఆదేమిటండీ. దానిమీద ఆరువందలా పాతిక వేసుంది! అప్పుడు మనం నలభయ్ కనుకుంటాను అది కొనింది!

"అవునులే అన్నీ పెరిగిపోయాయి మరి! (స్వగతం) అన్నట్టూ అప్పుడు మీ జీతమెంతండీ!"

"రెండువందల చిల్లర."

అయితే ఈ చీరతోపాటు మీ జీతం...."

వెండి తెరమీద బొమ్మలు కదలిపోతున్నాయి. అందులో హీరో ,స్వశక్తిమీద పైకొచ్చిన ఒక గవర్నమెంటు డాక్టరు. అతను బీద రోగుల సేవార్థం ఎక్కువ కాలం హాస్పిటల్‌లోనే గడుపుతుంటాడు. అంతవరకు బాగానే వుంది. మరో సెట్టులో అతనిల్లు అది ఇల్లుకాదు ఇంద్రభవనం-కాంపౌండ్ లోపలే రోడ్లు, నిగనిగ మెర్సిడీస్ కారు పిలిస్తే పలికే నౌకర్లు. కేవలం ఆరు వందల రూపాయల గవర్నమెంటు జీత గాడు. ప్రయివేట్ ప్రాక్టిస్ లేని ఆ డాక్టర్‌కి ఆ ఇల్లూ. ఆ కారు ఎలా వచ్చిందో భగవంతుడికే తెలియాలి. నాకు విసుగొచ్చే సరికి హీరోగారు సిల్కు తెరలు కట్టిన డబల్ "కాట్" మీద "సింగిల్"గా అలసి నిద్ర

పోతున్నారు. శ్రీమతితో చెప్పి లేచి బయటకెళ్ళి చల్లగాలి పీల్చుకుందామని ప్రక్కకు తిరిగాను.

ఆమె సినిమాలో పూర్తిగా లీనమైపోయింది! పెరిగిన వంకాయల ధరగానీ, రేపు పెరగబోయే సబ్బు ధరగానీ, ఆరు వందల పాతిక రూపాయల చీరతో పాటు సమంగా పెరగని తన భర్త జీతంగానీ అవేమీ ఆమెకాక్షణంలో గుర్తున్నట్టు లేదు. ఆ మూడు గంటల సేపయినా వాస్తవాన్ని మరిచి కలలాటి కథలో లీనమైపోయిన ఆమె ఆనందాన్ని విరిచేయడం ఇష్టంలేక మవునంగా లేచి బయటికొచ్చేశాను.

గేటు బయటకురాగానే చక్కరటిపండ్లు ఎదురొచ్చాయి. ఏమీ తోచని నేను వాడితో బేరం మొదలెట్టాను.

"ఒక్క పండు ఎంతోయ్."

"రూపాయండి సార్. చాలా తియ్యగా వుంటాయి సార్."

"అదేంటోయ్ నిన్ననేగా తొంభయ్ పైసలకు కొన్నాను."

"ఇరవై నాగులు గంటల క్రితం మాటకదా సార్ అది!" అని తన జోక్‌కు తనే నవ్వుతున్న వాడి నవ్వు భరించలేక "సరే రెండివ్వు" అనేసి రెండు రూపాయలు సమర్పించి పళ్ళు అందుకుని హాల్లోకి మరలా అడుగు పెట్టాను.

ఇప్పుడు వెండి తెరమీద డాక్టరుగారి సతీమణి చంటిపాపకు బంగారు ఉగ్గుగిన్నెలో ఉగ్గుకాబోలు పడుతోంది. ఆమె చెలికత్తెలు కాబోలు ఆ బంగారు ఉగ్గు గిన్నెను, పాపిడి బంగారు మేనిఛాయను పోలుస్తూ పాట పాడుతున్నారు.

నాకు పెద్ద సందేహం వచ్చింది. ఇప్పుడు సవరు బంగారు ఖరీదెక్కువా? డాక్టరుగారి నెలజీత మెక్కువా?

*